

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## వాసవ సజ్జిక

**బయట కారు ఆగిన చప్పుడు** వినగానే అహల్య గోడగడియారం వైపు చూసింది. తొమ్మిదిన్నర. సాధారణంగా ఆరింటికే ఆఫీస్ అయిపోయినా విక్రమ్ ఏనాడూ వెంటనే ఇంటికి రాడు. ఆఫీస్‌లోనే ఉండి రేపటి పని కూడా దాదాపు సగం చేసి వస్తాడు. అందుకనే అతనికి ఆఫీస్‌లో మంచి పేరు, గుర్తింపు ఉన్నాయి. మరి ఇంట్లో? చిన్నగా నిట్టూర్చింది.

"హనీ డేమ్ టయర్డ్. ఐదు నిమిషాల్లో ఫ్రెష్ అయి వస్తాను. వడ్డించెయ్." ఆమె వైపు చూడకుండానే బెడ్ రూములోకి వెళ్ళిపోయాడు.

తనవంక ఒకసారి చూసుకుంది అహల్య. తెల్లటి పాలనురగలాంటి చీర, జాకెట్, తల్లో మల్లెపూలు.. తనకే ముద్దొచ్చేలా ఉంది. కాని ఈ మానవుడు క్రీగంట కూడా చూడలేదు.

ప్లేట్లో ఏమున్నాయో కూడా చూడకుండా గబగబా తినేస్తున్నాడు విక్రమ్. 'నువ్వు తిన్నావా?' అని కూడా అడగలేదు. ఆగలేక చెప్పింది.

"విక్కీ ఓసారి వంటకాలన్నీ చూడు. తర్వాత నిదానంగా తిను. ఎవరో తరుముకు వస్తున్నట్లు ఎందుకా తొందర?"

విక్రమ్ ఓసారి టేబుల్ మీది పాత్రల్లోని పదార్థాలు చూసాడు. అన్నీ తనకి ఇష్టమైనవే.

"నాకు ఇష్టమని ఇన్ని రకాలు ఒక్కసారే చేయడం ఎందుకు.. టైం వేస్ట్? ఐనా నాకిప్పుడు అలా ఇష్టమైన కూరలు అంటే సిల్లీగా ఉంటోంది. బతకడానికి తినాలి కానీ తింటానికి బతకకూడదు. అందుకు ఏదైతే ఏంటి?" విసుక్కున్నాడు.

"నిజమే బతకడానికి తినాలికదా? అదే ఇష్టమైంది తింటావు అని"

ఏమీ మాట్లాడకుండా గబగబా తినేసి వెళ్ళిపోయాడు విక్రమ్.

వంటిల్లు సర్దేసి అహల్య బెడ్ రూంలోకి వెళ్ళే సమయానికి అతను మెయిల్స్ చెక్ చేసుకుని పక్కమీదకి వాలాడు. అహల్య అతని పక్కన కిటికీ వైపు పడుకుని కర్టెన్‌ని పక్కకి లాగింది తెల్లటి వెన్నెల గదంతా పరుచుకుంది.

"అబ్బ! కర్టెన్ వెయ్యి హనీ. చిరాగ్గా ఉంది. అంత వెలుతురులో నిద్రెలా పడుతోంది?" చెప్పాడు విక్రమ్.

విభ్రాంతిగా చూసింది అహల్య.

"విక్కీ! నీకు వెన్నెల వెలుగు కూడా చిరాగ్గా ఉందా? ఇదివరకు మనం పౌర్ణమి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేవాళ్ళం కదూ?"

"అవన్నీ అజ్ఞానపు రోజులు అహల్యా. ఇప్పుడు తలుచుకుంటే సిగ్గుగా కూడా ఉంటుంది."

"సిగ్గా? వెన్నెలని అనుభవించడం అజ్ఞానమా?"

"అవును. నన్ను నిద్రపోనీ. రేపు ఆఫీస్‌కి వెళ్ళాలి."

"లేదు. రేపు ఆదివారమే. నిద్రపోకు. నీతో చాలా మాట్లాడాలి."

"ఏంటీ?"

"ఒక్కసారి నా వైపు చూడు విక్కీ. నీకోసం ఎంత బాగా తయరయ్యానో చూడు. నీకు దోసగింజలాంటి బొట్టు ఇష్టమని ఎన్నిసార్లు కుదరక చెరిపేసి పెట్టుకున్నానో తెలుసా?" మార్దవంగా చెప్పింది.

అతను కళ్ళు తెరిచి అహల్య వైపు చూసాడు. వెన్నెల వెలుగులో చెక్కిళ్ళు మెరుస్తూ, సుగంధ భరితంగా ఉన్న ఆమెని చూసి నవ్వి చెప్పాడు.

"నీకు ఇవాళ మూడ్ వచ్చింది. దానికింత ప్రిపరేషన్ అవసరమా? ' విక్కీ ఇవాళ సెక్స్ కావాలి' అని డైరెక్ట్‌గా అడగచ్చు కదా?"

దెబ్బతిన్నట్లు చూసింది అహల్య.

"అంటే? నీ ఉద్దేశం ఏమిటి?"

"ఏమీలేదు. నువ్వు ఎదగాలి అహల్యా. తెల్ల చీరలు, మల్లెపూలు ఇలాంటి టైం వేస్ట్ పనుకలంటే, ఏదైనా క్రియేటివ్ పని చెయ్యి జంతువులు చూడు ఎంత సహజంగా ఉంటాయో? అవి నీలా అలంకరించుకోవు."

"నన్ను జంతువులతో పోలుస్తున్నావా విక్కీ?"

"లేదు. జంతువులని చూసి నేర్చుకోమంటున్నాను. వాటిలా సహజంగా ఉండంటున్నాను."

"మనం ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం విక్కీ. మన పెద్దవాళ్ళు ఒప్పుకోకపోతే మూడేళ్ళు వెయిట్ చేసి వాళ్ళని ఒప్పించి చేసుకున్నాం పెళ్ళయిన కొత్తల్లో ఎంత సరదాగా ఉన్నాం? మూడేళ్ళ వియోగ కాలంలో నువ్వు ఎన్ని విరహగీతాలు రాసి పంపేవాడివి? పెళ్ళయి వేరు కాపురం పెట్టాక నువ్వెంత విశృంఖలంగా ఉండేవాడివి? నేను మారలేదు. అలాగే ఆనాటి అహల్యలానే ఉన్నాను. నువ్వెందుకు మారిపోయావు విక్కీ?"

"నువ్వు మారలేదు. అదే నా బాధ కూడా. ఎదగాలి అహల్యా. చిన్నప్పుడు మన్ను తిన్నామని పెద్దయ్యాక తింటే నవ్వుతారు. ఇప్పుడు సీసా పాలు తాగగలవా? చిన్నప్పటిలా చిన్నగౌను వేసుకుని తిరగ్గలవా?"

"నువ్వు భౌతిక ఉదాహరణలు చెపుతున్నావు విక్కీ. నేను చెప్పేది మానసికం. భౌతికంగా మనం మారతాం. మారాలి. కానీ మానసికంగా మనం అప్పుడప్పుడు బాల్యంలో ఉండాలి. ఎప్పుడూ యవ్వనంలో ఉండాలి. అంతేకానీ నువ్వు అర్థం లేని పోలికలు చెప్పి సమర్థించుకోవద్దు" ఆవేశంగా చెప్పింది.

"ఎదగాలి హనీ ఎదగాలి. ఉద్యోగంలో ఎదగాలి. బాగా డబ్బు సంపాదించాలి. మనకో పేరు, ప్రతిష్ట కావాలి. అవన్నీ కావాలంటే నీతో సరసాలాడుతూ కూర్చోకూడదు. కష్టపడాలి."

"ఓహో! ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు సెక్రటరీలు ఎవరూ పెళ్ళాలతో కాపురం చేయరా?" వ్యంగ్యంగా అడిగింది.

"చేస్తారు.. ఎందుకంటే వాళ్ళ పని చేసిపెట్టటానికి అసిస్టెంట్స్ ఉంటారు. కానీ నా పని నేనే చెయ్యాలి."

"ఓకే. ఒప్పుకుంటాను. కానీ ఈ సమయంలో నీకు ఆఫీస్ పనేం లేదే? ఇంటినుంచి నిర్వహించే లావాదేవీలు లేవు కదా? మరి నువ్వెందుకు ఇంట్లో ఇంత యాంత్రికంగా ఉంటున్నావు? బన్నీని చూడటానికి హాస్టల్‌కి వెళ్ళి ఎన్నిరోజులైందో తెలుసా? వాడెంత దిగులు పడతాడు?" రుద్ధంగా అడిగింది.

"వాడి మంచి కోసమేగా హాస్టల్‌లో చేర్చింది? రేపు వాడు పెద్ద ఉద్యోగంలో చేరి బాగా డబ్బు సంపాదిస్తే అనుభవించేది వాడేకదా?"

"పాపం చిన్నవాడుకదా! ఇంత ముందు చూపులేక వాడికి దిగులు" వెటకారంగా చెప్పింది అహల్య.

"ఇక్కడ కూడా పక్షులని, జంతువులని ఆదర్శంగా తీసుకోవాలి హనీ. పక్షులు చూడు రెక్కలు రాగానే పిల్ల పక్షి ఎగిరిపోతే నీలా దిగులుపెట్టుకోవు. జంతువులూ అంతే! తల్లిపాలు మానగానే వాటిదారిన అవి వెళ్ళిపోతాయి. నువ్వు మరీ వాడిని నీలా సెంటిమెంటల్ ఫూల్‌ని చేస్తున్నావు. సిటీలోని అతిమంచి స్కూల్‌లో, అతి మంచి హాస్టల్‌లో అన్ని సౌకర్యాలతో ఉండి చదువుకోడానికి ఏం బాధ వాడికి?"

"నాకోసం ప్రేమ కవిత్వాలు రాసి, నేను ఎప్పుడు బయటకి వస్తానా అని మా వీధిచివర కాపు కాచి, నాతో మాటలు కలపడానికి ఆరాటపడిన విక్కీ ఏడి? మ నాన్న ఎన్ని చివాట్లు పెట్టినా 'నాకు అహల్య కావాలండీ' అని చెప్పిన విక్కీ ఎక్కడ విక్కీ?" ఆవేదనగా అడిగింది అహల్య.

"అవన్నీ గుర్తుచేయద్దు హనీ. తలుచుకుంటే సిగ్గుతో ప్రాణం పోతుంది.అంత పిచ్చి పనులు ఎందుకు చేసానో ఏమిటో? ఆ సమయంలో ఏ కంప్యూటర్ కోర్సులోనో చేరి ఉంటే నా కెరీర్ ఇంకా బావుండేది అన్నీ అర్థం లేని పనులు, చేష్టలు. నువ్వు అవన్నీ ఎంజాయ్ చేయడమే కాక ఇంకా కావాలి అంటావు. అవన్నీ సిల్లీ అహల్యా. వాటి గురించి ఆలోచించి టైం వేస్ట్ చేసుకోకు. బీ నేచురల్. సహజంగా ఉండు, అంతే కానీ వెన్నెల, పిల్లగాలి లాంటి మాటలు చెప్పద్దు. నీ కోరికని ఫ్రాంక్ గా చెప్పు. అంతే."

వెన్నెల వెలుగులో చెంపలమీదకి జారే కన్నీళ్ళు తళతళ మెరుస్తూండగా భర్తని సూటిగా చూస్తూ అడిగింది అహల్య.

"ఓ మేధావీ! ఏ జంతువు కెరియర్ గురించి ఆలోచిస్తుంది?.ఏ పక్షి డబ్బు సంపాదించాలని తపన పడుతుంది? సహజంగా ఉండే ఏ జీవజాలం ఎదగాలి ఎదగాలి అని తాపత్రయపడుతుంది? భార్యాబిడ్డలు ప్రేమలు నీకు సిల్లీ. కానీ ఓవర్ టైం చేసి మంచిపేరు, డబ్బు సంపాదించాలన్న తపన సిల్లీకాదు. ఇంటికి మల్లెపూలు కొనుక్కెళ్ళేవాడు, పెళ్ళాన్ని పార్క్‌కి తీసుకెళ్ళేవాళ్ళు నీ దృష్టిలో అన్ నేచురల్. కానీ విక్కీ డబ్బు సంపాదనలో మెదడుని ఓ యంత్రంగా మార్చుకున్న నువ్వు చాలా అసహజమైన వాడివి గుర్తుంచుకో."

తల్లోని మల్లెదండని తీసి కిటికీలోంచి బయటకి విసిరికొట్టింది అహల్య.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story